



ఈ సారి ఎన్నికల బరిలో నిలుస్తున్న కొత్త అభ్యర్థులకు బీఫాం: *ఆదివారం బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ చేతులమీదుగా బీఫాం అందుకుంటున్న బడే నాగజ్యోతి (ములుగు), భూక్యా జాన్సన్‌నాయక్ (ఖానాపూర్), అనిల్ జాదవ్ (బోథ్), కొత్త ప్రభాకర్‌రెడ్డి (దుబ్బాక)*

మర్యాదగా ఉండండి!

- సంస్కారంతో నడుచుకోండి
- ప్రతి కార్యకర్తతో మాట్లాడండి
- ఎక్కువగా ప్రజల్లో ఉండండి
- ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించండి
- ఎన్నికల సన్నద్ధతపై అభ్యర్థులకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం
- 69 మంది అభ్యర్థులకు బీఆర్ఎస్ పార్టీ బీఫారాల అందజేత

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): 2023 అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థులకు బీఫారాలను అందజేసింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే అభ్యర్థులు, పార్టీ ఇన్‌చార్జిలతో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ భేటీ అయ్యారు. తెలంగాణ భవన్‌కు చేరుకొన్న సీఎం తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో తొలివిడతలో 69 మందికి బీఫారాలు అందజేశారు. మిగిలిన అభ్యర్థులకు సోమవారం సాయంత్రంలోపు అందజేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా బీఫారాలు అందుకున్న అభ్యర్థులకు సీఎం కేసీఆర్ ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. బీఫారాలు, ఎన్నికల ప్రచారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతీ అభ్యర్థికి రెండేసి బీఫారాలు ఇస్తామని, ఏదైనా కారణంతో ఒక ఫారం చిరిగిపోయినా.. ఇంకు పడి చెడిపోయినా ఇంకో ఫారాన్ని వాడుకోవచ్చని తెలిపారు. రెండో ఫారాన్ని ఎమ్మెల్యేలు జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సూచించారు. బీ ఫారంతోపాటు రూ.40 లక్షలకు సంబంధించిన చెక్కును కూడా అందజేస్తున్నామని, చెక్కును ఎన్నికలకు సంబంధించిన అధికారిక ఖాతాలో వేసుకోవాలని తెలిపారు.

అణకువతో ఉండాలి

అభ్యర్థులంతా మర్యాదగా నడుచుకోవాలని కేసీఆర్ సూచించారు. ఎన్నికల రంగంలోకి వెళ్లే సమయంలో అభ్యర్థులందరూ ఆచితూచి వ్యవహరించాలని, అణకువతో ఉండాలని తెలిపారు. నామినేషన్ దాఖలు సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. రాజకీయాలు అన్నాక మంచి, చెడు ఉంటాయని, కార్యకర్తలను, పార్టీ మేలుకోరేవారిని సమన్వయం చేసుకొంటూ వెళ్లాలని సూచించారు. ప్రజల్లోకి వెళ్లినప్పుడు కోపతాపాలు తగ్గించుకోవాలని తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ.. సర్దుబాటు చేసుకొని విజయతీరాలకు చేరుకోవాలని సూచించారు.

సిట్టింగ్‌లకే ఇచ్చాం..

'చాలా సందర్భాల్లో.. చాలా సమావేశాల్లో మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే సీట్లిస్తామని చెప్పాం. మీరంతా విజయం సాధిస్తారన్న గొప్ప ఆత్మవిశ్వాసాన్ని నేను గతంలో ప్రకటించిన' అని అభ్యర్థులనుద్దేశించి కేసీఆర్ వ్యాఖ్యానించారు. 4-5 స్థానాలు మినహా.. అది కూడా విధిలేని పరిస్థితుల్లోనే సిట్టింగ్‌లను మార్చామే తప్ప మళ్లీ అందరికీ అవకాశం ఇచ్చామని తెలిపారు. అవకాశం రానివాళ్లతో మాట్లాడి తొందరపడొద్దని చెప్పామని అన్నారు. 'ఎమ్మెల్యేగా ఎన్నికవడమే ఫైనల్ కాదు.. ఇప్పుడు పార్టీ అధికారంలో ఉన్నది.. మళ్లీ అధికారంలోకి రాబోతున్నది.. ఎన్నో అవకాశాలుంటాయని చెప్పినం.' అని కేసీఆర్ తెలిపారు.

గెలువలేక ట్రిక్స్ ప్లే చేస్తున్నారు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వనమా వెంకటేశ్వర్‌రావు, గద్వాల ఎమ్మెల్యే సహా మరికొంత మంది మీద కేసులు వేశారు. రకరకాల కుయుక్తులు పన్నారు. ఎన్నికల్లో ఓటమిపాలై.. మనతో గెలువలేక మన శత్రువులు ట్రిక్స్ ప్లే చేస్తున్నారు. ప్రజల్లో గెలిచినా మనల్ని సాంకేతికంగా దెబ్బతీయాలని చూస్తున్నారు. గద్వాలలో కృష్ణమోహన్‌రెడ్డి 29-30వేల మెజార్టీతో గెలిచిండు. ఘన విజయమది. కానీ సాంకేతిక కారణం చూపించి ఎన్నికను రద్దుచేయించే ప్రయత్నం జరిగింది. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మంచి మెజార్టీతో గెలిచిండు. ఇక్కడ కూడా సాంకేతికపరమైన అంశాలతో న్యాయస్థానం ముందుకు కేసు వెళ్లింది. ఇటు వంటి విషయాల్లో ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. నామినేషన్ పత్రాలు నింపే ముందు, అఫిడవిట్లు దాఖలు చేసేముందు, ఎన్నికల నిబంధనలు పాటించడంలో జాగ్రత్తలు పాటించాలి.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేతులమీదుగా బీఫాం అందుకుంటున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ)

సర్దుబాటు చేసుకోవాలి

'వేములవాడలో ఎమ్మెల్యే అభ్యర్థిని వాస్తవంగా మార్చాల్సిన అవసరం లేకుండె. ఉన్న ఎమ్మెల్యే గెలిచేవారు. గెలుస్తారన్న నమ్మకం ఉండె. ఆయన మీదున్న న్యాయపరమైన చిక్కువల్లే మార్చి వేరే అభ్యర్థిని పెట్టాం. కూర్చోబెట్టి మాట్లాడితే వారు అర్థం చేసుకొని సహకరిస్తున్నారు. అక్కడ మంచి సర్దుబాటు జరిగింది' అని కేసీఆర్ పేర్కొన్నారు. 'కోవా లక్ష్మి క్రితంసారి కొద్ది తేడాతో ఓడిపోయారు. అప్పుడు ఓడిపోవాల్సింది కాదు. అక్కడ నుంచి గెలిచిన ఆత్రం సక్కుతో మాట్లాడాం.. మీకు అనేక అవకాశాలుంటాయని చెప్పాం. అక్కడ కూడా ఇద్దరి మధ్య సర్దుబాటు జరిగింది' అని వివరించారు. చాలా సీట్లల్లో పెద్ద హడావుడి లేకుండా చక్కగా విజయవంతంగా సర్దుబాటు చేశామని వివరించారు.

చాలా ఓపికగా ఉండాలి

'చిల్లర పనుల వల్ల కొంత మంది ఎంత గొప్ప అవకాశాలు కోల్పోతారో.. నా అనుభవంలో నేనే చూసిన. అనేక మంది దగ్గరదాకా పోయి దెబ్బతిన్న వాళ్లున్నారు. ఇలాంటి పరిస్థితి రావొద్దంటే ఏ సందర్భంలోనైనా సంస్కారవంతంగా.. ఓపికగా ఉండటం, మంచిగా ప్రవర్తించడం గొప్ప గుణం' అని అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. ఏవైనా అరమరికలుంటే తీసేయాలని, వెంటనే తొలగించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఇది తాను వ్యక్తిగతంగా చేస్తున్న ముఖ్యమైన విజ్ఞప్తి అని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలు మనల్ని జాగ్రత్తగా గమనిస్తుంటారని, చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

చెప్పినా వినకుండా జూపల్లి ఓడిపోయిండు

గత ఎన్నికల్లో ఇద్దరు వ్యక్తులకు సర్దుకుపోవాలని చెప్పినం. పద్ధతి మార్చుకోవాలి.. ఒక రిద్దరితో మాట్లాడాలని చెప్తే వారు మాట్లాడలే. మాట్లాడకపోవడం వల్లే ఓడిపోయారు. మీకందరికీ తెలిసిన వ్యక్తి జూపల్లి కృష్ణారావు. మనం మంత్రిగా కూడా చేసుకున్నం. ఒక వ్యక్తి అక్కడి నుంచి పోటీచేస్తానంటే.. అందరం మాట్లాడి వద్దని ఒప్పించినం. జూపల్లి ఒక్క ఫోన్‌చేసి పిలిస్తే ఆయనకు సహకరిస్తానని ఆ వ్యక్తి చెబితే.. ఫోన్ చేయాలని జూపల్లి కృష్ణారావుకు మేం చెప్పినం. కలుపుకొని పోవాలని చెప్తే అహంకారానికి పోయి జూపల్లి మాట్లాడలే. తుది ఫలితం ఏమైందంటే.. ఆ వ్యక్తి పోటీచేస్తే 14వేల ఓట్లుచ్చినయి. జూపల్లి ఓడిపోయిండు. ఫలితం ఇట్లా ఉంటది.

మనకు సహకరించేందుకు ఓ బృందం: కేసీఆర్

భరత్‌కుమార్

బీఫారాలు, నామినేషన్లు, అఫిడవిట్లకు సంబంధించి మనకు సహకరించేందుకు 20 మందితో కూడిన న్యాయకోవిదులు, అడ్వొకేట్స్ బృందం ఉన్నది. అభ్యర్థులంతా న్యాయవాది, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్‌కుమార్‌తో మాట్లాడుకోవాలి. ఏవైనా అనుమానాలుంటే నివృత్తి చేసుకోండి. అంతా తమకే తెలుసు అని అనుకోవద్దు. ఎన్నికలకు, ఎన్నికలకు మధ్య నిబంధనలు మారుస్తుంటరు. కొత్త నిబంధనలు వస్తున్నాయి. అంతా పాతదే ఉంటది.. మాకు అంతా తెలుసులే. మేం గతంలో పోటీ చేసినం అని అనుకోవద్దు. పార్టీ లీగల్ టీం, న్యాయవాది భరత్‌కుమార్ 24 గంటలపాటు అందుబాటులో ఉంటారు. ఏ రకమైన సహకారం కావాలన్నా అందిస్తారు. రాష్ట్ర పార్టీకి.. ఎన్నికల సంఘానికి భరత్‌కుమార్ వారిధిగా వ్యవహరిస్తారు. భరత్‌కుమార్‌తోపాటు 20 మంది న్యాయవాదుల టీం, ఆడిటర్లు ఉంటారు. అభ్యర్థులు అనుమానాలున్నా.. సందేహాలు వచ్చినా ఒక్క ఫోన్‌చేస్తే వారు నిమిషాల మీద న్యాయవాదులను పంపిస్తరు. అవసరమైతే సమస్య తీవ్రతను బట్టి భరత్‌కుమారే వస్తరు. హెలికాప్టర్‌ను కూడా రెడీగా పెట్టినం.

బీ ఫారాలతో జాగ్రత్త!

- ఎక్కడా పొరపాట్లు జరుగకుండా చూడాలి
- ముందుగానే ఫారాలు నింపిపెట్టుకోవాలి
- ఓటరు జాబితాలో ఉన్నట్టే పేరు రాయాలి
- అభ్యర్థులకు అధినేత కేసీఆర్ సూచనలు

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ఎక్కడా పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తపడాల్సిన బాధ్యత అభ్యర్థులదేనని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. 'నామినేషన్ వేసే రోజే ఫారంలను నింపాలనుకోవడం తప్పు. ఆదివారమే బీ ఫారాలిస్తున్నం. సోమవారం కూడా కొంత మందికి ఇస్తం. ఇప్పుడే నింపిపెట్టుకోవాలె' అని సూచించారు. ఫారం నింపేటప్పుడు అప్‌డేటెడ్ ఓటర్‌లిస్టును పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు ఎలా ఉంటే అలాగే రాయాలని, ఓటరు జాబితానే ప్రామాణికమని వివరించారు.

పోలీసు కేసుల వివరాలు.. అఫిడవిట్ జాగ్రత్త

నామినేషన్ సందర్భంగా ఉండే అన్ని నిబంధనలను పాటించాలని, అభ్యర్థులపైన ఏమైనా పోలీసు కేసులుంటే సంబంధిత పోలీసు స్టేషన్ల నుంచి వివరాలు లిఖితపూర్వకంగా తీసుకోవాలని కేసీఆర్ సూచించారు. అభ్యర్థుల నేర చరిత్రను ప్రజలకు చెప్పాలని ఎన్నికల సంఘం నిబంధన పెట్టిందని, ఈ నేపథ్యంలో నేర చరిత్ర, కేసులు ఏమైనా ఉంటే వాటిని పత్రికల ద్వారా వెల్లడించాల్సి ఉంటుందని తెలిపారు. పార్టీ, అభ్యర్థి వేర్వేరుగా పత్రికల్లో మూడుసార్లు ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. అఫిడవిట్ విషయంలో కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అభ్యర్థి పేరుపై, ఆయన భార్య, మైనర్లుగా ఉండే పిల్లలపై ఉండే ఆస్తులు, అప్పుల వివరాలన్నీ అఫిడవిట్‌లో చేర్చాలని, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, షేర్లు, వాహనాలు, బంగారం, బీమా వివరాలు.. ఇలా ఆర్థికపరమైన ప్రతి అంశాన్ని అఫిడవిట్‌లో పేర్కొనాలని తెలిపారు. అభ్యర్థులందరూ పాత బకాయిలు, పన్నులు చెల్లించాలని సూచించారు. ఇంటి పన్నులు, వాహనాలకు సంబంధించిన ట్రాఫిక్ జరిమానాలు, ప్రభుత్వ నివాసాల్లో ఉంటే వాటికి సంబంధించి బకాయిలను చెల్లించాలని, మంత్రులు తమకు ప్రభుత్వం కేటాయించే వాహనాలకు సంబంధించి ఏమైనా బకాయిలుంటే వాటిని తీర్చేయాలని ఆదేశించారు. పాత బకాయిలను సొంత నిధులతోనే చెల్లించవచ్చని, వీటిని నామినేషన్ దాఖలుకు ముందే చెల్లించాలని సూచించారు. నామినేషన్ సందర్భంగా అనవసరమైన ఆర్భాటం వద్దని, ఈసీ నిబంధనల మేరకు ముగ్గురు లేదా నలుగురితో కలిసి నామినేషన్ వేసుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లను జాగ్రత్తగా ఎంచుకోవాలని అభ్యర్థులకు అధినేత కేసీఆర్ సూచించారు.

పార్టీ ఫండ్ 40 లక్షలు

పార్టీ అభ్యర్థులంతా నామినేషన్ దాఖలు చేసే సమయానికి ఈ ఎన్నికలకు సంబంధించి డబ్బు ఖర్చు చేయడానికి సంబంధించి ప్రత్యేక ఖాతాను తెరువాలి. ఈ ఖాతా నుంచే ఎన్నికలకు సంబంధించిన ప్రతీ లావాదేవీని నిర్వహించాలి. ఈ ఖాతా నుంచే ఎన్నికల నామినేషన్‌కు సంబంధించిన డిపాజిట్ సొమ్మును చెల్లించాలి. పార్టీ తరపున ప్రతీ అభ్యర్థికి బీ ఫారంతోపాటు 40 లక్షలను పార్టీ ఫండ్‌గా అధికారికంగానే ఇస్తున్నాం. ఈ సొమ్మును ఎన్నికల ఖర్చుకు ఉపయోగించుకోవాలి. ఆచితూచి ఖర్చు పెట్టాలి. ఖర్చు పెట్టే క్రమంలో ఖర్చు లెక్కలను ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకులు కూడా పరిశీలిస్తారు. వారికి పార్టీ అభ్యర్థులు పూర్తిగా సహకరించాలి. ఎన్నికల సంఘం సూచించిన ఖర్చుకన్నా తక్కువే ఖర్చు చేయాలి.

మ్యానిఫెస్టో సర్వజనహితం

ప్రజల్లో సంబురం.. ప్రతిపక్షాల్లో నైరాశ్యం

బీఆర్ఎస్ మ్యానిఫెస్టో తెలంగాణ రాష్ట్ర భవితకు భరోసానిచ్చేది. ఈ మ్యానిఫెస్టోతో ప్రజలు సంబురాల్లో మునిగితే.. ప్రతిపక్షాలు మాత్రం నైరాశ్యంలో మునిగిపోయాయి. సీఎం కేసీఆర్ మాస్టర్ స్ట్రోక్‌తో ప్రతిపక్షాలు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి. బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టబోతున్నది.. రికార్డ్ సృష్టించబోతున్నది. విజన్, కమిట్‌మెంట్ ఉన్న నాయకుడిగా గతంలో ఇచ్చిన హామీలను, ఇవ్వని హామీలను సీఎం కేసీఆర్ సమర్థంగా అమలు చేశారు. ప్రస్తుత మ్యానిఫెస్టో హామీలనూ వందశాతం అమలు చేస్తారని ప్రజలు నమ్ముతున్నారు.

- హరీశ్‌రావు ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి

సబ్బండ వర్గాలకు కొండంత అండ

ఈ మ్యానిఫెస్టో సబ్బండ వర్గాలకు కొండంత అండ. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో మరెక్కడా లేవు. ప్రస్తుతం కొనసాగిస్తున్న వాటిలో కొన్ని పథకాల పరిధిని పెంచేలా, లబ్ధిదారులకు మరింత మేలు జరిగేలా పలు అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపర్చడం హర్షణీయం. సీఎం కేసీఆర్ పాలన ఓ స్వర్ణయుగం. ప్రజల ఆశీస్సులతో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం.

- ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి

ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టే మ్యానిఫెస్టో

ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా ఉన్నది. రాష్ట్ర ప్రజలందరికీ ఆమోదయోగ్యం. సామాజిక పింఛన్ల పెంపు లక్షల మంది అసహాయుల జీవనానికి ఆసరాగా నిలుస్తుంది. రైతుబంధును రూ.16 వేలకు పెంచి అన్నదాతలపై సీఎం కేసీఆర్ ప్రేమను, వ్యవసాయంపై తనకున్న వాత్సల్యాన్ని మరోసారి చాటారు. రూ.400కే గ్యాస్ కనెక్షన్ పేద కుటుంబాలకు ఊరటనిస్తుంది.

- ఇంద్రకరణ్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి

చేసేదే చెప్తారు.. అమలు చేస్తారు

కేసీఆర్ చేసేదే చెప్తారు.. చెప్పింది కచ్చితంగా అమలు చేస్తారు. సమాజంలోని అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా అమలులో లేని రైతుబీమా, రైతుబంధు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు పథకం అమలు ఘనత కేసీఆర్‌దే. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలనూ అమలుచేసి ఆచరణలో చూపించారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చి అమలు చేయలేక అభాసుపాలవుతున్న విషయం ప్రత్యక్షంగా కనిపిస్తున్నది.

- నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి

అడగకుండానే అవసరాలు తీరుస్తున్నారు

రాష్ట్ర ప్రజలు అడగకుండానే తెలుసుకొని సీఎం కేసీఆర్ వారి అవసరాలను తీరుస్తున్నారు. ఇలా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే తలమానికంగా నిలిచింది. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో కాంగ్రెస్, బీజేపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం సుభిక్షంగా, సురక్షితంగా ఉంటుందన్న బలమైన నమ్మకంతో ప్రజలు ఉన్నారు.

- సత్యవతి రాథోడ్, గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి

సంక్షేమంలో తెలంగాణే నంబర్‌వన్

ఈ మ్యానిఫెస్టో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి బాటలు వేస్తుంది. సౌభాగ్యలక్ష్మి పథకం భారతావనికే తలమానికం అవుతుంది. 400కే గ్యాస్ సిలిండర్, 5 లక్షల కేసీఆర్ బీమా, ఆసరా, రైతుబంధు సాయం పెంపు, ఆరోగ్యశ్రీ, అగ్రవర్ణ పేదలకు గురుకులాల వంటి హామీలు అద్భుతం. గ్రేటర్ పరిధిలో మరో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లు, పేదలకు ఇండ్లస్థలాలు, అసైన్డ్ భూములపై ఆంక్షల ఎత్తివేతతో పేదలకు న్యాయం జరుగుతుంది.

- సబితాఇంద్రారెడ్డి, విద్యాశాఖ మంత్రి

బీమా చరిత్రాత్మక నిర్ణయం

ఇది నూరుశాతం పీపుల్స్ మ్యానిఫెస్టో. పేద మహిళలకు 3 వేల జీవన భృతిని ప్రకటించి వారి పట్ల కేసీఆర్ గొప్ప మనసు చాటుకున్నారు. 93 లక్షల కుటుంబాలకు బీమా ప్రకటించడం చరిత్రాత్మక నిర్ణయం. ఇలా కేసీఆర్ రాష్ట్ర ప్రజలందరి ఆత్మబంధువని మరోసారి రుజువైంది.

- కోలేటి దామోదర్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్

బీఆర్ఎస్‌కు వంద సీట్లు ఖాయం

బీఆర్ఎస్‌కు ఈసారి వందసీట్లు దక్కడం ఖాయం. కేసీఆర్ అంటే మాట మీద నిలబడే నాయకుడు. చెప్పిన మాట చేసి తీరుతాడు. చెప్పనివి కూడా చేస్తాడని ప్రజలకు నమ్మకమున్నది. ఆ నమ్మకాన్ని నిజం చేస్తూ 9 ఏండ్లల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ, అన్ని వర్గాలను ఆదరిస్తూ వస్తున్నారు.

- వై సతీశ్‌రెడ్డి, తెలంగాణ రెడ్కో చైర్మన్

ముందే వచ్చిన దసరా, దీపావళి

బీఆర్ఎస్ మ్యానిఫెస్టో వెలువడగానే ఊరూరా దసరా, దీపావళి ముందే వచ్చినంత సంబురాలు జరిగాయి. ఇది ప్రజల్లో అంతులేని సంతోషాన్ని కలిగిస్తే.. విపక్షాలకు మాత్రం హార్ట్ స్ట్రోక్‌ను కలిగించింది. సీఎం కేసీఆర్ ఇచ్చే హామీలను జనం గుండెల్లో పెట్టుకుంటారు. తెలంగాణను అద్భుత విజయాల వైపు నడిపించిన కేసీఆర్ మరోసారి ప్రజామోదం పొందనున్నారు.

- ఆంజనేయగౌడ్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్

మహిళలకు జీవన భృతి గొప్ప నిర్ణయం

తెలంగాణ ఏర్పడ్డాక మహిళలకు ఎంతో మేలు జరుగుతున్నది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళల సంక్షేమానికి అనేక పథకాలను అమలుచేస్తున్నది. తాజాగా పేద కుటుంబాల మహిళలకు నెలకు రూ.3 వేలు జీవన భృతిని అందిస్తామని ప్రకటించడం సంతోషంగా ఉంది. మాలాంటి పేదలకు జీవనభృతి ఎంతో ఉపయోగపడుతుంది.

- గుండ భవ్యశ్రీ, గృహిణి, వేములకుర్తి, మెట్‌పల్లి మండలం, జగిత్యాల జిల్లా

కేసీఆర్ దివ్యాంగుల పాలిట దైవం

సీఎం కేసీఆర్ దివ్యాంగుల పాలిట దైవం. ఎన్నికల మ్యానిఫెస్టోలో దివ్యాంగుల పింఛన్‌ను మరో రూ.2 వేలు పెంచుతూ మానవత్వం చాటారు. ఇలాంటి నాయకుడు తెలంగాణలో ఉండటం రాష్ట్రంలోని దివ్యాంగులు చేసుకున్న అదృష్టం. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ అందుకుంటున్న 5.35 లక్షల మంది దివ్యాంగులు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకు దివ్యాంగులంతా ఏకమై వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి కృతజ్ఞత చాటుకుంటాం. దేశంలో సీఎం కేసీఆర్ మాత్రమే పెద్ద మొత్తంలో దివ్యాంగులకు పింఛన్ అందిస్తున్నారు.

- వాసుదేవరెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్

దేశమంతా అమలు చేయాలి

బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అద్భుతంగా ఉన్నది. ఇది తెలంగాణకే కాదు.. దేశమంతా అమలు చేయాల్సిన అవసరమున్నది. గత మ్యానిఫెస్టోలన్నింటినీ వందశాతం అమలు చేసిన సీఎంగా, మరోసారి అందరికీ ఆమోదయోగ్యమైన, ఆశాజనకమైన మ్యానిఫెస్టోను కేసీఆర్ ప్రకటించారు. ఆయన వంటి నిబద్ధత కలిగిన నేత దొరకడం తెలంగాణ ప్రజల అదృష్టం. కేసీఆర్ అంటేనే నమ్మకం.. నమ్మకం అంటేనే కేసీఆర్. అందుకే.. తెలంగాణ ప్రజలందరూ ఈ మ్యానిఫెస్టోకు బ్రహ్మరథం పడుతున్నారు. మరోసారి సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారు.

- రాధారపు సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ ఎన్నారై బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు



తెలంగాణభవన్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు. చిత్రంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, వికలాంగులు



ఆదివారం వరంగల్ నగరంలోని కాశీబుగ్గ చౌరస్తాలో పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు

మ్యానిఫెస్టోపై సకల జనుల సంబురం

- మ్యానిఫెస్టోతో ప్రతి ఇంటా పండుగ
- మనసున్న ముఖ్యమంత్రి అంటూ జేజేలు
- మళ్లీ కేసీఆరే సీఎం అంటూ సంబురాలు
- ఊరూరా పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ
- కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- కోలాహలంగా మారిన తెలంగాణ

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 15: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ప్రజా నాడి తెలిసిన కేసీఆర్.. ఓటు కోసం కాకుండా ప్రజా శ్రేయస్సు కోసం అమలయ్యే హామీలతో మ్యానిఫెస్టో రూపొందించారంటూ ఆదివారం తెలంగాణ నేలంతా సంబురాలతో మారుమోగిపోయింది. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొన్నది. మనసున్న సీఎం అంటూ ప్రజలు జేజేలు పలుకుతున్నారు. మళ్లీ కేసీఆరే సీఎం అవుతారంటూ ఊరూరా పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. దీంతో తెలంగాణ కోలాహలంగా మారింది. కేసీఆర్ మ్యానిఫెస్టో ప్రకటిస్తున్న క్రమంలోనే తెలంగాణ భవన్ ప్రాంగణంలో గులాబీ రంగు పూసుకొని పార్టీ కార్యకర్తలు డప్పు చప్పుళ్లు.. నృత్యాలతో తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. పేద, దిగువ, మధ్యతరగతి వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ లాగా మరొకరు భరోసా ఇవ్వలేరని ఈ మ్యానిఫెస్టో తేల్చిచెప్పిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గుదిబండగా మారిన గ్యాస్ సిలిండర్ బారాన్ని ప్రభుత్వమే భరిం చే విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవడం వల్ల ప్రతి గృహిణీ గులాబీ పార్టీకి జై కొడుతుందని రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సంబురాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే వికలాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవ్‌రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో పటాకులు పేల్చి దివ్యాంగులు సంబురాలు చేసుకున్నారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 19న తెలంగాణ భవన్‌లో వికలాంగులందరం కలిసి సభ ఏర్పాటు చేసి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని అసైన్డ్ భూములపై ఆంక్షల ఎత్తివేతకు చర్యలు తీసుకుంటామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నది. రాష్ట్రంలో 1954 నుంచి సుమారు 13 లక్షల మందికి అసైన్డ్ పట్టాలు ఇచ్చినట్టు గణాంకాలు చెప్తున్నాయి. 21 లక్షల ఎకరాల భూమిని ప్రభుత్వాలు వారికి కేటాయించాయి. ఆంక్షలు ఎత్తివేసి భూములపై తమకు సంపూర్ణ హక్కులు కల్పించాలని లబ్ధిదారులు దశాబ్దాలుగా కోరుతున్నారు. వీరి వేదనను మానవీయ కోణంలో అర్థం చేసుకున్న కేసీఆర్.. ఆంక్షల ఎత్తివేతకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయంతో 13 లక్షలకుపైగా కుటుంబాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.